www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -43 గురువారం 28 మే 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం

### మహారాష్ట్ర సీఎంకురేవంత్ రెడ్డి లేఖ

**చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి**

**ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి**

**న్యూఢిల్లీ,మే 27(ప్రజావినికిడి):** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు **మిగతా 2లో...**




## త్రిభాషా సూత్రం..

### కేంద్రం, ఎన్సీఈఆర్టీలకు సుప్రీంకోర్టు నోటీసులు



**జులై 1 నుంచి 9, 10వ తరగతి విద్యార్థులకు త్రిభాషా సూత్రం**

**త్రిభాషా సూత్రంపై సుప్రీంకోర్టులో పిటిషన్**

**రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని కేంద్రానికి నోటీసులు**

**న్యూఢిల్లీమే 27(ప్రజావినికిడి):**
ఎన్సీఈఆర్టీలో త్రిభాషా సూత్రానికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం, సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీలకు నోటీసులు జారీ చేసింది. జులై 1వ తేదీ నుంచి 9, 10వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సీబీఎస్ఈ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. **మిగతా 2లో...**

## మమత, స్టాలిన్ ఓటమికి ఎస్ఐఆరే కారణం

**'ఎస్ఐఆర్'పై జగన్ సంచలన వ్యాఖ్యలు...**

**ఓట్ల తొలగింపుపై వైసీపీ శ్రేణులను హెచ్చరించిన జగన్**

**పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన**

**అమరావతి,మే 27(ప్రజావినికిడి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో భారీ ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్ వంటి కీలక నేతలు సైతం తమ నియోజకవర్గాల్లో ఓటమి పాలయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. ఇదే తరహా ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. **మిగతా 2లో...**



## కల్లాల వద్ద దైన్యంగా రైతులు

**పంటల కొనుగోలు లేక దీనావస్థ**

**వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి**

**బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి**

**పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు**

**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి):** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**





## కేరళం మాజీ సిఎం పినరయ్ నివాసాలపై ఇడి దాడులు

### కొచ్చిన్ మినరల్స్ లిమిటెడ్ కేసు

**తిరువనంతపురంమే 27(ప్రజావినికిడి):**
కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులకు దిగింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసులో భాగంగా సోదాలు చేపట్టింది. మాజీ సీఎం నివాసంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. రూ.1.72 కోట్ల ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్**మిగతా 2లో...**

## ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

**రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి**

**పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



2లో.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తాం

**టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడులో తొలి ప్రసంగం చేసిన నారా లోకేశ్**

**చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి అని వ్యాఖ్య**


**అమరావతిమే 27(ప్రజావినికిడి):**
తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన తొలి మహానాడు ప్రసంగం సందర్భంగా నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మహానాడులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారీ ప్రకటన చేయబోతున్నట్టు ముందుగానే ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. **మిగతా 2లో...**



## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

### సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌కు తరలింపు

**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి):**
పోక్స్ కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను బుధవారం పేట్ బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం అతడిని మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలించారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం భగీరథ్‌ను పోలీసులు ఈ ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లినట్ల తెలుస్తోంది. మరోవైపు భగీరథ్‌ను మూడు రోజులపాటు ప్రశ్నించేందుకు పోలీసులకు కోర్టు అనుమతి ఇచ్చింది. పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. అతడిని కస్టడీకి కోరుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. బండి భగీరథ్‌ను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో బండి భగీరథ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అతడిని మూడు రోజుల పాటు పోలీసులు విచారించనున్నారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా.. ఆమెపై అత్యాచారం చేశాడనే ఆరోపణలు బండి భగీరథపై వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మే 16వ తేదీన అతడిని పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. బండి భగీరథ్ నుంచి మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని.. వారం రోజుల పాటు అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులు స్పష్టం చేశారు. కానీ కోర్టు మాత్రం భగీరథ్‌ను మూడు రోజుల వరకే పోలీసుల కస్టడీకి అనుమతి ఇచ్చింది.




## అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

**పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం**

**కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన**

**తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్**



2లో.

## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

**జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు**

**కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు**

**మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి**



# త్రిభాషా సూత్రం..

## కేంద్రం, ఎన్సీఈఆర్టీలకు సుప్రీంకోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ క్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. భాష అనేది ఛాయిస్ అని, దీనిని బలవంతంగా రుద్దలేమని కపిల్ సిబాల్ అన్నారు. ఈ వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను జులై రెండోవారానికి వాయిదా వేసింది.

త్రిభాషా విధానాన్ని అమలు చేయడానికి సీబీఎస్ఈ లాజిస్టికల్ సంసిద్ధతపై నివేదిక సమర్పించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీని ఆదేశించింది. మరోవైపు, ఎనిమిదో తరగతి ఎన్సీఈఆర్టీ పుస్తకంలో న్యాయవ్యవస్థను కించపరిచేలా అంశాన్ని చేర్చడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2026-27 విద్యా సంవత్సరంలో 9, 10వ తరగతి విద్యార్థులు రెండు జాతీయ భాషలతో పాటు మొత్తం మూడు భాషలు తప్పనిసరిగా నేర్చుకోవాలని సీబీఎస్ఈ పేర్కొంది. విదేశీ భాషను చదవాలనుకునే విద్యార్థులు తృతీయ భాషగా దానిని ఎంపిక చేసుకోవచ్చని పేర్కొంది.

# కేరళం మాజీ సీఎం పినరయ్ నివాసాలపై ఇడి దాడులు

**మొదటిపేజీ తరువాయి**

లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీ 2018-2019 మధ్యకాలంలో మాజీ సీఎం విజయన్ కుమార్తె టి.వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి ఎలాంటి సేవలు అందించలేదు. అయినప్పటికీ సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి రూ.1.72 కోట్లు అక్రమంగా చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, 2024లో ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మంగళవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఈడీ అధికారులు తిరువనంతపురం

లోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన కుటుంబ నివాసం, కోజికోడ్‌లోని మాజీ పర్యాటక శాఖ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్ నివాసంతో సహా పలుచోట్ల ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో పెద్ద సంఖ్యలో అధికారులతో, కట్టుదిట్టమైన గోప్యత మధ్య ఈ సోదాలు మొదలయ్యాయి.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

చెప్పినట్టుగానే ఆయన భారీ ప్రకటన చేశారు. మహిళలు, యువతకు పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.నూతన హోదాలో తొలిసారి మహానాడు ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించిన లోకేశ్... మహిళా సాధికారతపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. "పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పాసైనా, అవ్వకపోయినా... రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ తరపున మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం" అని లోకేశ్ సంచలన ప్రకటన చేశారు. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అని, అందుకు కట్టుబడి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.నారా లోకేశ్ చేసిన ఈ భారీ అధికారిక ప్రకటనతో మహానాడు సభ ప్రాంగణంలో ఒక్కసారిగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అంతకుముందు నుంచే లోకేశ్ చేయబోయే ప్రకటనపై రాజకీయ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేయడం ద్వారా రాబోయే కాలంలో సరికొత్త నాయకత్వాన్ని తయారుచేస్తామని లోకేశ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు.

## తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు.

**కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి భేటీ**

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా భేటీ అయ్యారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్ వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. తెలంగాణ విజ్ఞప్తులపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

## ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ



**న్యూఢిల్లీ,మే 27(ప్రజావినికిడి):** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

# మమత, స్టాలిన్ ఓటమికి ఎస్ఐఆరే కారణం

**మొదటిపేజీ తరువాయి**

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపుపై అనేక రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేశాయని జగన్ గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల ఓట్లు, తమిళనాడులో 94 లక్షల ఓట్లు తొలగించారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని భబానీపూర్ నియోజకవర్గంలో 45,982 ఓట్లను తొలగించారని, అక్కడ మమతా బెనర్జీ 15,000 ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. అదేవిధంగా, తమిళనాడులోని కొళత్తూరు నియోజకవర్గంలో 71,000 ఓట్లను తొలగించగా, స్టాలిన్ 8,000 ఓట్లతో ఓటమి చవిచూశారని జగన్ విశ్లేషించారు. ప్రతి గ్రామంలో కొద్ది సంఖ్యలో నిజమైన ఓట్లను తొలగించినా, అది నియోజకవర్గ స్థాయి ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లపై నిశితంగా దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపుతూ, అక్కడ ఓటర్ల జాబితాలో ఒకే పేరు, ఒకే కుటుంబ వివరాలతో వేలాది అనుమానాస్పద ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు**

ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత జగన్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానిని పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు.

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు.

అభ్యర్థుల ఎంపిక, వారికి ఇవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీలు బలంగా ఉన్న గ్రామాల్లో వారి నుంచే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు.చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం 'వెన్నుపోటు రెండేళ్లు' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఓ÷ూఖ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట

నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

**ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి**

**జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు**

**కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు**

**మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి):**

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి):**

భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్లా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబానగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 28 మే 2026

# చెరుకూరు ధర్మవరం రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలి

## వాజేడు మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహా ధర్నా




కృష్ణారెడ్డి ని లాగేస్తున్న పోలీసులు

**వాజేడు,మే 28,(ప్రజావినికిడి):**
వాజేడు మండలంలోని చెరుకూరు నుండి ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే విస్తరించి ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చెరుకూరు ఎన్ఎచ్,163 రహదారి పై వాజేడు మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాజేడు మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెనుమల రామకృష్ణారెడ్డి నాయకత్వం వహించారు.
ఈ ధర్నాలో మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు,మాజీ సర్పంచ్‌లు,రైతు నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు,పార్టీ కార్యకర్తలు అలాగే ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. చెరుకూరు నుండి ధర్మవరం వరకు ఉన్న రహదారి చాలా చిన్నగా ఉండటంతో ప్రతిరోజూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెరుకూరు ధర్మవరం మార్గం అనేక గ్రామాలకు ప్రధాన రవాణా మార్గమని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవల కోసం ప్రయాణించే ప్రజలు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. అయితే రహదారి దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటంతో పాటు విస్తరణ లేకపోవడం వల్ల వాహనాలు ఎదురెదురుగా వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వచ్చిందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఈరోడ్డును రెండు లైన్లు మంజూరు చేసింది కానీ ఈ ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు "రోడ్డు విస్తరణ వెంటనే చేపట్టాలి", "ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు", "ప్రభుత్వం మేల్కొనాలి", "ప్రజలకు రక్షణ కల్పించాలి" అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.
ధర్నా కారణంగా చెరుకూరు ఎన్ఎచ్,163 రహదారి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. కొంతసేపు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం రహదారిపై కూర్చొని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులు మరియు కార్యకర్తలను పోలీసులు అడ్డుకొని ధర్నాను భగ్నం చేశారు. ఈ సందర్భంగా కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.
బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి చెరుకూరు నుండి ధర్మవరం వరకు రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఈ రహదారిపై ఇకనైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే రాబోయే రోజుల్లో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీతో ఆర్పీఐ పొత్తు



**అబిడ్స్, (ప్రజావినికిడి):** రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు, భవిష్యత్తులో తెలంగాణలో జరగబోయే శాసనసభ, పార్లమెంటు ఎన్నికలలో జాతీయ పార్టీ బిజెపితో కలసి పొత్తు ఉంటుందని ఆర్పీఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పేరం శివ నాగేశ్వర్ రావ్ మీడియా సమావేశంలో తెలిపారు. ఈ మేరకు
కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) జాతీయ అధ్యక్షులు,కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు తెలంగాణలో ఇరు పార్టీల మధ్య పొత్తుల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.
ఆర్.పి.ఐ తరపున పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావును అధికారికంగా కలిశారు.రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, ఆర్పీఐ కలిసి ఉమ్మడిగా పోటీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో తెలంగాణ ఆంధ్రా మీడియా కన్వీనర్ టి.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# "రైజింగ్ తెలంగాణ సిఎస్ఆర్ అవార్డ్స్"

## వేడుకలకు డీజీపీ సీవీ ఆనంద్ రాక




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ అభివృద్ధి, యువత సాధికారత, మహిళా పారిశ్రామిక వేత్తల ప్రోత్సాహానికి అంకితభావంతో పనిచేస్తున్న హధ్యాస్ మీడియా,నారి నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న "రైజింగ్ తెలంగాణ సీస్ఆర్ అవార్డ్స్" వేడుకలకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ను ప్రత్యేక అతిథిగా నారి నిర్మాణ్ సీఈఓ జగన్నాథం మాదిరెడ్డి, హధ్యాస్ మీడియా డైరెక్టర్ పవన్ కుమార్,అరుణ్, ఆర్పీఐ జనరల్ సెక్రటరీ పేరం శివ నాగేశ్వర గౌడ్, ఆర్పీఐ మహిళా విభాగ నాయకురాలు గంగాపురం పద్మ, హధ్యాస్ మీడియా ప్రతినిధులు,సంస్థ సభ్యులు ప్రత్యేకంగా మర్యాద పూర్వకంగా కలసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సేవా దృక్పథం, ఆధునిక పోలీసింగ్ వ్యవస్థ బలోపేతానికి డీజీపీ సీవీ ఆనంద్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధరంగాల్లో ప్రతిభ కనబరిచిన యువ పారిశ్రామికవేత్తలు, మహిళా నాయకులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, సామాజిక సేవకులు, ఆటోమొబైల్ రంగ ప్రతినిధులను సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నారి నిర్మాణ్ సీఈఓ జగన్నాథం మాదిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రజల భద్రత,యువతకు ప్రేరణ,సమాజ సేవలో డీజీపీ సీవీ ఆనంద్ చేస్తున్న కృషి ఆదర్శనీయమైనదని కొనియాడారు. హధ్యాస్ మీడియా డైరెక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, "రైజింగ్ తెలంగాణ భావనకు అనుగుణంగా తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడం తమ లక్ష్యం"అని పేర్కొన్నారు. ఈ వేడుకలకు వ్యాపార, రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# త్రాగునీరు,డ్రైనేజి సమస్యను పరిష్కరించాలి.

## కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్..





**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ డివిజన్ లో సాయి నగర్ లో నెలకొన్న డ్రైనేజ్,మంచినీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ సాయి నగర్ నిర్మాణ బాధ్యులు కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.
సాయి నగర్ సిపిఐ నాయకులతో కలిసి బస్తీలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగింది. అనంతరం అయన మాట్లాడుతూ, మండుటెండకాలంలో గుక్కెడు నీరు లేక బస్తీ ప్రజలంతా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ముఖ్యంగా రోజు వచ్చే నల్ల నీళ్లు కేవలం రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయని, దీంతో తాగడానికి ఇతరత్రా అవసరాలకు మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదేవిధంగా సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం వల్ల మురుగు నీరు అంతా రోడ్లపైన ఏరులై పారుతుందని, అడుగు తీసి అడుగు పెట్టలేకపోతున్నారని వాపోయారు. వచ్చే సీజన్ వర్షాకాలం కావున ముందస్తుగా జలమండలి అధికారులు దృష్టి సారించి మంచినీటిని, డ్రైనేజ్ సమస్య తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సాయి నగర్ సిపిఐ నాయకులు షాహిదా బేగం,ఎం.శ్రీనివాస్,కొమ్ము రాములు, దానమ్మ, పాషా,కె.యాదయ్య, మహేందర్, అచ్చలి,పద్మ,లావణ్య, హేమలత బాలమణి, యాదయ్య, వెంకటయ్య, వెంకటమ్మ, మున్నా తదితర నాయకులు పాల్గొన్నారు.

# కొందుర్గు మండలంలో నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం.. ప్రభుత్వ కార్యాలయాలకు భవన సదుపాయం..వ్యవసాయ సహకార సంఘం భవన ఆవిష్కరణ..రైతాంగానికి సహకార కార్యక్రమాలు.. ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధి జాతరను ఆవిష్కరించారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. కొందుర్గు మండలంలో పాత ఆగిర్యాల,ఆగిర్యాల గ్రామాలలో రూ. 45 లక్షలతో గ్రామపంచాయతీ భవనం,స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం భవన సదుపాయాన్ని ఆవిష్కరించారు. ఆగిర్యాల గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ భవనం 15 లక్షలు (డిఎంఎస్ టి నిధులతో) అదేవిధంగావ కొందుర్గు మండల కేంద్రంలో పిఎసిఎస్ నూతన గోదాం అలాగే కార్యాలయ భవనం ప్రారంభం చేశారు. ఇట్టి భవనం (పిఎసిఎస్)సొంత నిధులతో కట్టారు. ఈ కార్యక్రమానికిమండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగూరి పురుషోత్తం రెడ్డి,మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి,చౌదరి గూడెం మండల అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్, సర్పంచులు నాగం యాదమ్మ,శేఖర్ రెడ్డి,పిఎసిఎస్ డైరెక్టర్ జితేందర్ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు,ప్రభాకర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు,సహకార సంఘం డైరెక్టర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ది అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ

# రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాధమే

## జాతీయ అసిస్టెంట్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ వివరణ




**ఎల్బీనగర్,మే 27(ప్రజావినికిడి):** ' 'ది అఖిల భారతీయ విశ్వకర్మ మహా సభ రిజిస్ట్రేషన్ నంబర్ SO009384 తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం అని బిఎన్ రెడ్డి నగర్ లోని సాగర్ కాంప్లెక్స్ నందు గల తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో పత్రికా సమావేశంలో జాతీయ నాయకులు రాజ శేఖర్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వివరణ ఇచ్చారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని ఆయన అన్నారు. దీనికి వ్యతిరేకంగా ఎవరైనా దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని ఆయన అన్నారు. ఇట్టి విషయం పై ఎవరైనా సాంఘిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశానికి ది అఖిల భారతీయ మహా సభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులైన అధ్యక్షులు కౌలే జగన్నాథం,వర్కింగ్ ప్రెసిడెంట్ గుండోజు గంగాధర్,ప్రధాన కార్యదర్శి సంకోజు లింగా చారి,కోశాధికారి ఆవంచ మురళీధరాచారి,అధికార ప్రతినిధి పడాల సతీష్ చారి,గౌరవ సలహాదారు కనపర్తి లక్ష్మణ్ చారి,మహిళా గౌరవ అధ్యక్షురాలు సావిత్రి పట్నాల,ఇంద్రాల అశ్విని మహిళా ఉపాధ్యక్షురాలు,బోనాల ఇందిర మహిళా కార్య దర్శి,దాసోజు లక్ష్మనాచారి ఉపాధ్యక్షులు,కొల్లోజు సురేష్ చారి ప్రచార కార్యదర్శి,కొంపోజు నరహరి చారి ముఖ్య సలహా దారు,మూట కోడూరు పద్మశ్రీ అధ్యక్షురాలు కల్చరల్ ప్రెసిడెంట్,వీరాచారి జాయింట్ సెక్రటరీ,వెంకట్ చారి సలహా దారు,ఎడవల్లి రాఘవాచారి యూత్ సెక్రటరీ,కొండోజు సుదర్శన్ చారి అధ్యక్షుడు అంబర్ పేట,వడ్ల చంద్ర శేఖర్ సభ్యుడు,కె లోకనాథం మెంబర్,కౌలే అభిషేక్ యూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకో టౌన్ వద్దు ఇండస్ట్రియల్ పార్కే కావాలి.. : షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

## రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని కలిసి ఎకో పార్క్ ప్రతిపాదన విరమించుకోవాలి అని కోరిన ఎమ్మెల్యే



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టోన్ ను ఏర్పాటు చేయవద్దని షాద్ నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని కలిసి కోరారు. సిద్దాపూర్ అలాగే పరిసర గ్రామాల ప్రజలు ఎకో టోన్ ప్రతిపాదనకు పూర్తిగా వ్యతిరేకం అని తెలిపారు.
మా ప్రజలు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పడితే ఇక్కడి ప్రజలకు ఉపాధి దొరుకుతుందని భూములు ఇచ్చారు. కానీ ఎకో టౌన్ లాంటి ప్రతిపాదన తెచ్చి మా ప్రాంతాలలో పర్యావరణ సమస్యలను కొని తెచ్చుకోవడానికి సిద్ధంగా లేమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ,
సిద్దాపూర్ లో ఏకో టౌన్ ప్రతిపాదన వద్దని కోరుతున్నందున ముఖ్యమంత్రికి నివేదిస్తానని తెలిపారు. ప్రజలకు అనుకూలంగా నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాశీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## బిఆర్ఎస్ సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ చైర్మన్ గా ఎమ్మె సత్యనారాయణ

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు.**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం సిద్దపూర్ డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ చైర్మన్ గా ఎస్ బి పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ నియమితులయ్యారు. డంపింగ్ యార్డ్ పై పోరాటం చేయడానికి బిఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సందర్భంగా ఆ పార్టీ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నేతృత్వంలో పట్టణ కేంద్రంలోని పప్పీరస్ పోర్ట్ రిసార్ట్ లో సమావేశాన్ని నిర్వహించి పోరాటపటిమగల నాయకుడు ఎమ్మె సత్యనారాయణను చైర్మన్ గా నియమించారు.

## రణరంగంగా మారిన గాంధీభవన్

**మంత్రుల సమక్షంలోనే నేతల బాహాబాహీ**



**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి):** హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, విహెచ్, ఎమ్మెల్సీలు బల్యమూరి, అద్దంకి దయాకర్‌ల సమక్షంలోనే నేతలు ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హాజీ బాహాబాహీకి దిగారు. ప్రొటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హాజీ నెట్టివేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడిపోయారు. ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వీహెచ్ యత్నించారు. ఆయన్ను కూడా నెట్టివేసేలా వ్యవహరించడంతో నేతలు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో మంత్రి అజహరుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ సర్ ప్రక్రియపై చర్చించేందుకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు వేదికైంది. పార్టీ సీనియర్ నేత, మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పక్కన కూర్చొనే విషయంలో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కార్వాన్ ఇన్ చార్జ్ ఉస్మాన్ అల్ హాజీల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. మొదట ఇద్దరి మధ్య మాటల యుద్ధంతో ప్రారంభమైన ఈ గొడవ కాస్తా శృతిమించి ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే ఆగ్రహంతో ఉస్మాన్.. ఫిరోజ్‌ఖాన్‌ను గట్టిగా తోసేయడంతో ఆయన ఒక్కసారిగా కిందపడిపోయారు. గాంధీభవన్ లో సీనియర్ నేతల సమక్షంలోనే ఈ రసాభాస జరగడంతో అక్కడ ఉన్న పార్టీ శ్రేణులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి. ఈ గొడవ మరింత పెద్దది కాకుండా ఉండేందుకు అక్కడే ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే, ఆవేశంలో ఉన్న నేతలు వీహెచ్‌ను కూడా పక్కకు తోసేసేందుకు ప్రయత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. వెంటనే అప్రమత్తమైన మిగతా కాంగ్రెస్ నాయకులు, భద్రతా సిబ్బంది మధ్యలో దూరి ఇరువర్గాలను విడదీయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

## రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

**పలు జిల్లాల్లో తహసిల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు**

**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి): :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహశీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్‌ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్‌ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్‌ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్‌ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్‌ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్‌ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్‌ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహశీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్డీసీగా , ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## నగరంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

**ఏకకాలంలో 8మంది అధికారుల బృదం తనిఖీలు**



**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి):** హైదరాబాద్ నగరంలోని పలు ఆర్టీవో కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మేడ్చల్ ఆర్టీవో కార్యాలయం, నాగోల్ ఆర్టీవో కార్యాలయాలతో పాటు కొండాపూర్ ఆర్టీవో కార్యాలయంలో కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. సుమారు 8 మంది అధికారులతో కూడిన బృందాలు ఏకకాలంలో కార్యాలయాలను తనిఖీ చేస్తున్నాయి. ఆర్టీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. పెండింగ్గ్ ÷ళ్లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ పక్రియపై అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే ఆర్టీఏ ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను కూడా విచారిస్తున్నారు. ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతర రిజిస్ట్రేషన్ పనులు అక్రమంగా జరుగుతున్నాయనే సమాచారంతో ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది

## షాద్ నగర్ మార్కెట్ యార్డు పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** పట్టణంలోని మార్కెట్ యార్డులో ప్రస్తుత పరిస్థితులను అధికారులు పాలకవర్గం సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడగా తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసినట్లు వాళ్లు ఎమ్మెల్యేకు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వారిని అభినందించారు. అనంతరం పలువురు రైతులు కొనుగోలుదారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కోసం ఎప్పటి నుంచి అడుగుతున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని,ధాన్యం కొనుగోలుకు కేంద్రం సహకరించడం లేదని,ఇక్కడ నాయకులు మాత్రం డ్రామాలు ఆడడం మొదలు పెడుతున్నారని, ఈ నాటకాలు ప్రజలకు అర్థం అయ్యాయని ధ్వజమెత్తారు. పెట్రోలు ధరలు ఇప్పటికి నాలుగు సార్లు పెంచారని,అదే మద్దతు ధర పెంచి ఉంటే బాగుండేది అని హితువు పలికారు. మార్కెట్లో తడిసిన ధాన్యాన్ని కూడా పాతదర కంటే ఎక్కువగా కొనుగోలు చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు.రైతులు అరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అదేవిధంగా మార్కెట్లో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి పాలకమండలితోను,మార్కెట్ కార్యదర్శి తోను ఆయన సమీక్ష నిర్వహించారు.

ధాన్యం అమ్మకాలు కొనసాగుతున్నంతకాలం పాలకమండలి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. మార్కెట్లో రైతుల ధాన్యం తడవకుండా ఉండేందుకు రూ. 3.89 కోట్లతో సీసీ ప్లాట్ ఫాంలు, షెడ్ల నిర్మాణం వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పనులను త్వరితంగా చేపట్టాలని మార్కెట్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో ఫోన్ ద్వారా ఆయన మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్,సురేష్ గౌడ్,భరత్, వెంకట్ రెడ్డి,నవీన్ కుమార్,మార్కెట్ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు జితేందర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్,శ్రీధర్ రెడ్డి, రామచంద్రయ్య,చందు నాయక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ పోరాటానికి సిద్ధం!

**సిద్ధాపూర్ డంప్ యార్డ్ ప్రతిపాదనపై మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్పందన**

**కొత్తూరు పాపిరస్ రిసార్ట్ లో బిఆర్ఎస్ నేతలతో సమావేశం -అఖిలపక్షంతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రకటన**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు పారిశ్రామికీకరణలో భాగంగా సిద్దాపూర్ శివారులో ప్రభుత్వ భూములతో పాటు పేద రైతులకు అసైన్ చేసిన భూములను సేకరించేందుకు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది.మొదట ఈ ప్రతిపాదనను నేను వ్యతిరేకించాను. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో స్థానిక రైతులతో పాటు యువతకు ఉపాధి లభిస్తుందని అప్పటి అధికారులు వివరించడంతో అయిష్టంగానే ఒప్పుకున్నాను. రైతులు తామంతట తాముగా భూములు అప్పగిస్తేనే తీసుకోవాలని కండిషన్ పెట్టాను. తదనంతరమే భూసేకరణ చేపట్టి టీజీఐఐసీకి అప్పగించాము.


కాలుష్యకారక పరిశ్రమలతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోయారని టీజీఐఐసీకి అప్పగించిన భూముల్లో ఐటి హబ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెబితే నాడు ఎన్నికల సమయంలో షాద్ నగర్ వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.

అంతకుముందు ఎయిమ్స్ కళాశాల కోసం సిద్దాపూర్ భూములను నాటి మంత్రి జూపల్లి కృష్ణారావు,కలెక్టర్ టికే శ్రీదేవితో కలిసి పరిశీలించాము. ఇలా..ఏ పని చేసినా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నాటి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల రూపకల్పన సాగింది. కానీ..కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే సిద్దాపూర్ భూముల్లో పరిశ్రమలు కాకుండా కొత్తగా చెత్త డంపింగ్ యార్డ్ కు ప్రతిపాదించడం ఇక్కడి రైతులను మోసగించడం కిందికే వస్తుంది. ఉపాధి కల్పించడం చేతకాకపోతే రైతుల భూములను తిరిగి ఇవ్వండి.లేదా మరో రైతాంగ పోరాటానికి సిద్దాపూర్ వేదిక అవుతుంది..అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

సిద్దాపూర్ డంపు యార్డ్ ప్రతిపాదనపై బుధవారం కొత్తూరులోని ప్యాపిరస్ రిసార్టులో బిఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డంపు యార్డుకు వ్యతిరేకంగా అవసరమైతే అఖిలపక్షంతో కలిసి పోరాటం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. అధికార పార్టీ నేతలు సైతం దీనినివ్యతిరేకిస్తున్నారని,ఈ విషయాన్ని ప్రభుత్వంగుర్తించాలని ఆయన సూచించారు.ప్రతిపాదిత భూములకు ఆనుకొని ఎస్టీ గురుకుల కళాశాల,పాఠశాల, సమీపంలో పవిత్ర పుణ్యక్షేత్రం జేపీ దర్గా,అనంత పద్మనాభ స్వామి దేవాలయం,పీఅండ్ జీ లాంటి మల్టీ నేషనల్ పరిశ్రమలు ఉన్నాయని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల పరిశ్రమలు తరలి వెళ్లే అవకాశం ఉందని,వేలమంది ఉపాధి కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఫ్యూచర్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో డంపు సిటీ ఏర్పాటు చేయడం సబబు కాదని వివరించారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్,కొత్తూరు మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్,పార్టీ సీనియర్ నేతలు కడంపల్లి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మె సత్యనారాయణ,మండల అధ్యక్షుడు మెండే కృష్ణ,మాజీ ఎంపీటీసీ సభ్యుడు వద్దే బాలయ్య,వద్దే మహేష్,మాజీ కౌన్సిలర్లు నరసింహ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,గోపాల్ గౌడ్,నేతలు గోవింద్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,మిట్టు నాయక్,గోపాల్ నాయక్,కళ్ళెం నరసింహారెడ్డి,ఓం ప్రకాష్,కడాల శ్రీశైలం,రవి నాయక్,శ్రీను చారి, వెంకటేష్ సిటీకేబుల్,జోగు బాలరాజు,కుమ్మరిగూడ వెంకటేష్,ఆంజనేయులు,ప్రవీణ్, లక్ష్మయ్య,దన్నాడ జంగయ్య శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండగా నిలుస్తున్నాం

**: ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి**



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్ జైపూరి కాలనీలో నివాసం ఉంటున్న రుక్మిభాయ్ వెన్నుపూస సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.

వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి,బాధితురాలి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి సంబంధించి రూ. 2 లక్షల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా, బాధిత కుటుంబ సభ్యుడు రోహిత్ కు చెక్కును అందజేశారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది. అని పేర్కొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ తల్లి ఆరోగ్య సమస్య విషయంలో సుదీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని,ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చైతన్యపురి యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ మహిళా నాయకురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.67 కోట్ల పనులకు శ్రీకారం

### కర్నూలు అభివృద్ధికి వేగం పెంచిన మంత్రి టీజీ భరత్



**కర్నూలు మే 27(ప్రజావినికిడి):** :కర్నూలు నగరాన్ని ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ భరత్ తెలిపారు. నగరంలోని పలు వార్డుల్లో రూ.1.67 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఒబులేసు తో కలిసి మంత్రి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.9, 10, 11, 12, 13 వార్డుల్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ కాలువల మరమ్మతులు, 600 ఎంఎం సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణం, కమ్యూనిటీ టాయిలెట్ల మరమ్మతులు, ఫిషరీస్ కంపౌండ్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.అదేవిధంగా 1, 2, 6 వార్డుల్లో రూ.27.49 లక్షలతో సీసీ డ్రైనేజీ కాలువల మరమ్మతులు, కల్వర్టుల పునరుద్ధరణ, సీసీ రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. 18వ వార్డులో రూ.49.98 లక్షలతో సీసీ రోడ్డు విస్తరణ, 750 ఎంఎం సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 14, 15, 16, 17 వార్డుల్లో రూ.39.84 లక్షలతో బోర్‌వెల్లు, హెచ్‌డిపిఈ పైప్‌లైన్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.ఇటీవల గాలివాన తర్వాత మున్సిపల్, విద్యుత్ శాఖల సిబ్బంది సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టారని అభినందించారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన అందిస్తోందన్నారు. ఎన్నికల హామీ మేరకు కర్నూలును వైజాగ్ తరహాలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, ప్రస్తుతం ప్రారంభించిన పనులను మూడు వారాల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# పంచ్ ప్రభాకర్ పై క్రిమినల్ కేసులు పెట్టాలి: టీజీ వెంకటేశ్

**మే 27(ప్రజావినికిడి):**



ప్రవాసాంధ్రుడు, వైసీపీ మద్దతుదారుడు అయిన పంచ్ ప్రభాకర్ ఆర్యవైశ్య కమ్యూనిటీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్యవైశ్య మహాసభ చైర్మన్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కర్నూలులో మీడియా సమావేశం ఏర్పాటు చేసి పంచ్ ప్రభాకర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభాకర్‌పై క్రిమినల్ కేసులు పెడతామని, అతడిని కటకటాల్లోకి నెట్టేవరకు ఆర్యవైశ్య సమాజం నిద్రపోదని ఆయన హెచ్చరించారు.

పంచ్ ప్రభాకర్ చేసిన అసత్య ఆరోపణలను నిరసిస్తూ రాబోయే రోజుల్లో జిల్లాల వారీగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని టీజీ వెంకటేశ్ స్పష్టం చేశారు. "రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకోవడం సహజమే. కానీ, ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ ఆర్యవైశ్య కమ్యూనిటీపై ఇలాంటి తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం సరైంది కాదు" అని ఆయన మండిపడ్డారు.తన వ్యాఖ్యలను పంచ్ ప్రభాకర్ వక్రీకరించారని టీజీ వెంకటేశ్ ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. గతంలో రాయలసీమలో మీసాలు తిప్పుకుని తిరిగిన కొందరు నాయకులే, ఆ తర్వాత మీసాలు దించుకొని తన దగ్గరకు వచ్చారని మాత్రమే తాను అన్నానని గుర్తుచేశారు. అయితే, తాను అన్న మాటలను రెడ్డి సామాజికవర్గానికి ఆపాదిస్తూ పంచ్ ప్రభాకర్ మాట్లాడటం ఆయన మూర్ఖత్వానికి పరాకాష్ఠ అని కొట్టిపారేశారు. రెండు కమ్యూనిటీల మధ్య గొడవలు పెట్టేందుకే ఇలాంటి కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"నిజంగా ప్రభాకర్ అనే వ్యక్తికి అంత ధైర్యం ఉంటే, విదేశాల్లో దాక్కోవడం మానేసి ఇండియాకు రావాలి. ఆయన ఇక్కడికి వస్తే ఆర్యవైశ్యులే ఆయన్ను తన్నుకుంటూ తీసుకుపోతారు" అని టీజీ వెంకటేశ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. చట్టపరంగా ఆయనపై కఠిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు.


# శివుడి నివాసంలో ప్రాణాలు వదిలారు.. అక్కడే వదిలేస్తాం

### హైదరాబాద్ పర్వతారోహకుడి కుటుంబసభ్యులు

### గతవారం ఎవరెస్టులో ప్రాణాలు కోల్పోయిన అరుణ్ కుమార్

### మృతదేహాన్ని అక్కడే వదిలేయాలని నిర్ణయించుకున్నామన్న బావమరిది

### తీసుకొచ్చే ప్రక్రియ ప్రారంభమయ్యేసరికి మృతదేహం దెబ్బతింటుందన్న బావమరిది



**మే 27(ప్రజావినికిడి):** :శివుడి నివాసమైన హిమాలయ పర్వతాలలో అరుణ్ కుమార్ ప్రాణాలు వదిలారు కాబట్టి ఆయన మృతదేహాన్ని అక్కడే వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతవారం పర్వతారోహణ ముగించుకుని దిగివస్తుండగా హైదరాబాద్‌కు చెందిన పర్వతారోహకుడు అరుణ్ కుమార్ తివారీ ఎవరెస్టుపై మృతి చెందిన విషయం తెలిసిందే.మృతుడి బావమరిది సుధీర్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, మృతదేహాన్ని పర్వతంపైనే వదిలి వేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని నగరానికి తీసుకువచ్చేందుకు చేపట్టే ప్రక్రియలు ముగిసేసరికి మృతదేహం చాలా వరకు దెబ్బతింటుందని, మంచులో నుంచి దానిని తీసే ప్రక్రియ కూడా చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. దీనికి బదులు శివుడి నివాసంలోనే వదిలేయాలని కఠిన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ఎవరెస్ట్ యాత్రను నిర్వహించిన పయనీర్ అడ్వెంచర్స్ డైరెక్టర్ నివేశ్ కర్కి మాట్లాడుతూ, గత సంవత్సరం కూడా తివారి ఎవరెస్టును అధిరోహించడానికి ప్రయత్నించారని, కానీ ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో 7,200 మీటర్ల ఎత్తు నుంచి వెనక్కి వచ్చారని తెలిపారు. కానీ గతవారం ఎవరెస్టును విజయవంతంగా అధిరోహించి కిందకు దిగుతుండగా అస్వస్థతకు గురై శిఖరానికి కొంచెం దిగువన ఉన్న హిల్లరీ స్టెప్ సమీపంలో కన్నుమూసినట్లు తెలిపారు.

# గొడ్డలి పార్టీ నెవర్ అగైన్

### వేటకొడవళ్ల నుంచి గొడ్డళ్ల వరకు వైసిపి ప్రస్థానం

### ఐటి నుంచి క్వాంటం వరకు మారడం మన విధానం

### బోత్ ఆర్ నాట్ సేమ్.


### మహానాడులో చంద్రాబు ఉద్వేగ ప్రసంగం



**అమరావతిమే 27(ప్రజావినికిడి):** మహానాడు వేదికగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఘాటు విమర్శలు చేశారు. 'వేట కొడవళ్ల నుంచి గొడ్డళ్లకు మారడం వైసీపీ విధానం... ఐటీ నుంచి క్వాంటం వరకు మారడం మన విధానం... బోత్ ఆర్ నాట్ సేమ్. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అంటూ వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లు రాష్ట్రం ఎదుర్కొన్న పరిస్థితులే 'క్రూయల్ మెంటాలిటీ'కి ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ఏపీ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. లెగసీ వేస్ట్ క్లీన్ చేశామని... డోర్ టూ డోర్ గార్బేజ్ కలెక్షన్ చేస్తున్నామని తెలిపారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని, ఆస్తుల భద్రత కోసం ప్రతి ఒక్కరికీ క్యూ ఆర్ కోడ్‌తో బ్లాక్‌చైన్ టెక్నాలజీ అమలు చేస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ పరిణామాలు కూడా రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో యుద్ధం జరిగిందని... ఏపీలో గ్యాస్ సమస్య వచ్చిందని ప్రస్తావించారు. ఆక్వా, అరటికి రేట్లు పడిపోయాయని చెప్పారు. సంక్షేమాన్ని అవకాశంగా మార్చి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నామని వివరించారు. యువతకు కావాల్సింది గొడ్డలి వేటు కాదని... ఉద్యోగాలని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీ ముసుగులో 'గొడ్డలి పార్టీ' వచ్చిందని విమర్శించారు. 'ఐటీ నుంచి క్వాంటంకు మారడం మన నినాదం' అంటూ టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిపైనే తమ దృష్టి అని తెలిపారు. పార్టీ కేడర్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులకు సూచించారు. కేడర్‌ను గౌరవంగా చూసుకోవాలని... ఏ నాయకుడైనా కేడర్‌ను ఇగ్నోర్ చేయడానికి వీల్లేదని హెచ్చరించారు. పోలింగ్ బూత్ స్థాయిలో ఉండే ప్రతి కార్యకర్త నాయకుడే... తయారు చేయాల్సింది అనుచరులను కాదు, నాయకులను అంటూ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి సంజీవని ఇచ్చాం... మైహెల్త్ యాప్ తీసుకొచ్చామని తెలిపారు. ప్రతి కార్యకర్త ఆరోగ్యాన్ని పార్టీ మానిటర్ చేస్తుందని అన్నారు. పార్టీ అధినేతగా కార్యకర్తల కుటుంబ సభ్యుల సర్వతోముఖాభివృద్ధికి కూడా తనదే బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 'నాయకులను గౌరవిస్తాం... కానీ మీ పరిధిలో గెలవకపోతే మీకో దండం పెడతాం' అంటూ హెచ్చరించారు. మిత్రపక్షాలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. 'ఇగోలకు పోవద్దు... అహంకారం తగదు. మన కార్యకర్తకు ఇచ్చే గౌరవమే మనకు శ్రీరామరక్ష' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# వక్ఫ్ భూముల గొడవలే కారణం

### న్యాయవాది హత్య కేసులో పోలీసుల నిర్ధారణ -తండ్రీకొడుకులను అరెస్ట్ చేసిన పోలీసులు



**హైదరాబాద్,మే 27(ప్రజావినికిడి):** న్యాయవాది మొయినుద్దీన్ హత్యకేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్న హైదరాబాద్‌కు చెందిన రాజకీయ నేతతోపాటు ఆయన కుమారుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. విచారిస్తున్నారు. వక్ఫ్ బోర్డు నుంచి సదరు రాజకీయ నేతను తప్పించాలని న్యాయవాది మొయినుద్దీన్ తీవ్రంగా ప్రయత్నించారు. దీంతో రూ.15 లక్షల సుపారీ ఇచ్చి.. న్యాయవాదిని ఈ తండ్రికొడుకులు హత్య చేయించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని మలక్‌పేట, లక్డీకాపూల్, మల్లేపల్లి భూముల వివాదంలో ఈ న్యాయవాది హత్య జరిగిందని పోలీసుల విచారణలో వెల్లడయింది. వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ పోరాడుతున్నారు. మే 23వ తేదీన మాసబ్ ట్యాంక్ సమీపంలో మొయినుద్దీన్.. తన కారు ఎక్కుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఆయన్ని బలంగా ఢీకొట్టి.. అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని గమనించిన మొయినుద్దీన్ కుటుంబ సభ్యులు.. వెంటనే ఆయన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మొయినుద్దీన్ మరణించారు. ఘటనపై తొలుత పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేశారు. ఈ ఘటనపై పలు సందేహాలు వ్యక్తం కావడంతో.. ఈ కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ టీవీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. న్యాయవాదిని ఢీకొట్టిన కారుకు నెంబర్ ప్లేట్ లేకపోవడంతో.. ఈ పక్కా ఎ÷-లాన్ ప్రకారం జరిగిన హత్యగా పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో నిందితుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వక్ఫ్ భూముల విషయంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

# మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

### జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు

### మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే 27(ప్రజావినికిడి):**

ప్రధాని నరేంద్ర మోదీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు.

జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇకపోతే జనంలో లేకపోవడమే జగన్‌కున్న అసలు సమస్య అని, ఏపీ వ్యాప్తంగా నిరసనలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునివ్వడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలు జగన్ ఈ నిరసనలు ఎందుకు చేస్తున్నారో ఆయనకైనా స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి హామీలనూ అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నారని, అలా మాట్లాడే ముందు ఆయన క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన సత్యకుమార్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.ఇందులో భాగంగానే ప్రతి నెలా ఒకటో తారీఖునే లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం నెలకు దాదాపు 33 వేల కోట్ల రూపాయలను నేరుగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలిపి రాష్ట్రంలోని రైతులకు నిబంధనల ప్రకారం రూ.20,000లను వారి అకౌంట్లలో జమ చేయడం జరిగిందన్నారు. దీంతో పాటూ 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా ఏడాదికి పదివేల కోట్ల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లోకి వెళ్తున్నాయని వివరించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు పథకం ద్వారా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరూ రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రయాణాలు సాగిస్తున్నారని గుర్తుచేశారు. గతంలో కూడా జగన్ ఒక కోటరీని ఏర్పాటు చేసుకొని, కేవలం వాళ్లు చెప్పిన విషయాలనే వింటూ 'క్లౌడ్ నైన్' లో తిరిగేవారని.. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉన్నట్టు తనకు అనిపిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. 'పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది' అన్న చందంగా జగన్ వైఖరి ఉందన్న సత్యకుమార్.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు ఎటువంటి అరాచకాలు జరిగాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు.

# కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తప్పవు

### తప్పుదోవ పట్టించేలా ఎపి పేపర్ మిల్లు సమాచారం

### పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



**రాజమండ్రి,మే 27(ప్రజావినికిడి):** గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నదిలో కాలుష్యాన్ని నివారించేందుకు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పరిశ్రమలు ఇక్కడి వనరులను ఉపయోగించుకుని లాభాలు పొందుతున్నాయని, కానీ కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఏపీ పేపర్ మిల్ యాజమాన్యం తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిందని మంత్రి తెలిపారు. పరిశ్రమ నుంచి విడుదలైన రసాయనాల్లో పీహెచ్ స్థాయి 7 శాతం నమోదైనట్లు చెప్పారు. కలుషిత వ్యర్థాలను గోదావరిలో కలుపుతున్నారని, పరిశ్రమ యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పరిశ్రమల నుంచి మురుగునీరు నేరుగా బయటకు వస్తే యజమానులను జైలుకు పంపిస్తామని, గోదావరిలో వ్యర్థాలు కలిపితే ఆ పరిశ్రమలకు తాళాలు వేస్తామని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల కోసం రూ.8,500 కోట్ల బడ్జెట్‌తో ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. యాత్రికుల కోసం టెంట్ సిటీలు, హోం స్టేలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే నంది నాటకోత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏపీ పేపర్ మిల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆ సంస్థకు రూ.13 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

# అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాల్సిందే !

**మే 27(ప్రజావినికిడి):**
దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థకు సావాల్‌గా మారింది. అలాగే దేశంలో అలజడులకు కారణమవుతోంది. పెరుగుతున్న జనాభాకు తోడు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారి కారణంగా పలు రాష్ట్రాలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నాయి. దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. ఓటర్లుగా ఉన్న విదేశీయులను మొన్నటి ఎన్నికలకు ముందు సర్ ప్రక్రియలో లక్షల్లో తొలగించారు. దీనిపై నాటి సిఎం మమతా బెనర్జీ నానాయాగీ చేశారు. అసలు ఎంతమంది ఉన్నారన్నదానికి లెక్కాపత్రం లేనంతగా ఇక్కడ అక్రమ వలసదారులు చేరిపోయారు. అమెరికాలో ట్రంప్ వచ్చాక నిర్దాక్షిణ్యంగా అక్రమ వలసదారులను తన్‌ఇన తరిమేశారు. ప్రపంచ దేశాలు నిరసనలు వ్యక్తం చేసినా ట్రంప్ పట్టించుకోలేదు. ఇది ఓ హెచ్చరికగా అన చర్యలు నిలిచాయి. ఇప్పుడు భారత్ కూడా అలాంటి చర్యలను కఠినంగానే తీసుకోక తప్పదు. ఈ క్రమంలో బెంగాల్లో అక్రమవలసదారులపై ప్రభుత్వం కోరడా ఝుళిపించింది. ఇకపోతే అక్రమ వలసతకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీ ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్య భారతదేశ సార్వభౌమత్వా నికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా మారడం తో ఈ



నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా తెలిపారు. ఇదిలా వుంటే బెంగాల్లో అక్రంగా తిష్టవేసిన వారు ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరారు. మమతా బెనర్జీ హయాంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డవారు ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు పొంది, స్థానికులనే సవాల్ చేసే స్థాయికి చేరారు. ఈ క్రమంలో కొత్తగా అధికారం చేపట్టిన సువేందు అధికారి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అక్రమ వసలదారులను తరిమేసే పనులు చేపట్టింది. కొంచెం కఠినంగానే హెచ్చరించింది. తన్ని తరిమేసే వరకు ఆగకుండా పారిపోవాలని హెచ్చరించింది. ఈ క్రమంలో సరిహద్దులకు బంగ్లా అక్రమచొరబాటుదార్లు చేరుకుంటున్న దృశ్యాలు చూస్తున్నాం. దీనిని బట్టి ఎంతగా ఇక్కడ తిష్టవేశారో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా జరుగుతున్న క్రమంలోనే బెంగాల్లో కొత్త ప్రభుత్వం కఠిన చర్యలు ఇప్పుడు అక్కడ అక్రమవసలదారుల గుండెల్లో దడపుట్టిస్తోంది. తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొనేలోపే రాష్ట్రం విడిచి పారిపోవాలని చొరబాటుదారులను సీఎం సువేందు అధికారి తీవ్రంగా హెచ్చరించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసులను ఆదేశించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలి?

వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలి? ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా?' అని సువేందు ప్రశ్నించారు. గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి నినాదంతో రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరులను వెనక్కి పంపడానికి బెంగాల్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో అక్రమ వలసదారులపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి.. చట్ట విరుద్ధంగా ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాల ను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లో నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు నుంచి విడుదలై.. తమ తమ దేశాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర హోం శాఖ లేఖలు రాసింది. మొత్తంగా బెంగాల్లో ఏరివేత కారణంగా బీహార్, అసోం తదితర రాష్ట్రాల్లో వారు షెల్టర్ పొందకుండా చూడాలి. అక్కడి ప్రభుత్వాలు కూడా కఠినంగా వ్యవహరించాలి. అలాగే హైదరాబాద్‌లో తిష్టవేసిన రోహిగ్యాలను కూడా పట్టుకని పంపించాలి.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

## బక్రీద్ పర్వదినం నేడు

**మే 27(ప్రజావినికిడి):**
ముస్లింల ప్రధాన పండుగలలో ఒకటైన బక్రీద్ (ఈద్ అల్ అద్హా)ను నేడు దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. త్యాగం, విశ్వాసం, సేవా భావానికి ప్రతీకగా భావించే ఈ పండుగకు మసీదులు ఇప్పటికే ప్రత్యేక అలంకరణలతో సిద్ధమయ్యాయి. ఉదయం ప్రత్యేక నమాజ్‌ల కోసం వేలాది మంది ముస్లిం సోదరులు మసీదులకు తరలివెళ్లనున్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలుపుకోనున్నారు. బక్రీద్ సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. దుస్తుల దుకాణాలు, పండ్ల మార్కెట్లు, మాంసం విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. చిన్నారులు కొత్త దుస్తులు ధరించేందుకు ఆసక్తి చూపుతుండగా, యువత ప్రత్యేకంగా షాపింగ్‌లో నిమగ్నమయ్యారు. మహిళలు ఇంటి అలంకరణలు, వంటకాల ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. ఇస్లాం సంప్రదాయం ప్రకారం ప్రవక్త ఇబ్రహీం చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్‌ను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఖుర్బానీ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. త్యాగం చేసిన మాంసాన్ని బంధుమిత్రులతో పాటు పేదలకు పంచిపెట్టడం ద్వారా సేవాభావాన్ని చాటుకుంటారు.



పేదవారిని ఆదుకోవడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం ఈ పండుగ ప్రధాన సందేశంగా మత పెద్దలు పేర్కొంటున్నారు. పండుగ నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. మసీదుల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు కీలక కూడళ్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ అధికారులు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మసీదులు, ప్రార్థనా స్థలాల పరిసరాల్లో పరిశుభ్రత పనులు నిర్వహించడంతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించారు. పండుగ రోజున పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక విధుల్లో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. రాజకీయ, సామాజిక ప్రముఖులు ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మత సామరస్యానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరుతున్నారు. శాంతి, సోదరభావం, సేవా దృక్పథం సమాజంలో మరింత బలపడాలని ఆకాంక్షిస్తున్నారు.

# ఎబోలాకు రష్యన్ వ్యాక్సిన్

**మాస్కో,మే 27(ప్రజావినికిడి):**
ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తిపై ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో రష్యా కీలక ప్రకటన చేసింది. బుండిబుగ్యో ఎబోలాకు వ్యాక్సిన్ కనుగొన్నట్లు రష్యా ఆరోగ్య మంత్రి మురాష్కో పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా లోని రష్యా దౌత్యకార్యాలయం ఈ మేరకు ఎక్స్‌లో ప్రకటన చేసింది. రష్యన్ శాస్త్రవేత్తలు కొత్త ఎబోలా స్ట్రెయిన్ కోసం విజయవంతమైన వ్యాక్సిన్‌ను కనుగొన్నట్లు తెలిపింది. ఇది బుండిబుగ్యో స్ట్రెయిన్ నుంచి రక్షణ కల్పిస్తుందని వెల్లడించింది.




# పెరుగుతున్న ఎండల తీవ్రత


## అప్రమత్తంగా ఉండాలని ప్రధాని సూచన

**న్యూఢిల్లీ, మే 27(ప్రజావినికిడి):**
దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోజువారీ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు పెట్టారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్‌కు గురికాకుండా చూసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత ఉన్న సమయాల్లో అవసరం లేకుండా బయట తిరగకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాహంతో ఉన్న వారికి ఒక గ్లాస్ నీరు అందించాలని, ఇళ్ల ముందు, దుకాణాల బయట మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఇతరులకు తాగునీరు అందించే వారిని అభినందిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

# ఇడి దాడులపై భగ్గుమన్న సిపిఎం

**కేరళలో పలు చోట్ల ఆందోళనలు -బిజెపితో కాంగ్రెస్ చేతులు కలిపిందన్న నేతలు**

**తిరువనంతపురం,మే 27(ప్రజావినికిడి):**
కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళం శాసనసభ ప్రతిపక్ష నాయకుడైన పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను సిపిఎం ఖండించింది. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను నిరంతరం ఉపయోగించడంలో ఇది ఒక భాగమని సిపిఎం అభివర్ణించింది. సిపిఎం, ఇతర ప్రతిపక్ష శక్తులపై జరుగుతున్న విస్తృత రాజకీయ వేధింపులు, వ్యక్తిత్వ హననంలో ఈ దాడులు ఒక భాగమని సిపిఎం పేర్కొంది. ఈ చర్య కేరళ వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసింది. పలు జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడిని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఖండించారు. ఒక ప్రముఖ ప్రతిపక్ష నాయకుడిపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ పోస్టులో 'ఇలాంటి చర్యలు పినరయి విజయన్‌ను గానీ, సిపిఎంను గానీ భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో యూడీఎఫ్ ప్రభుత్వానికి కూడా ప్రమేయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ÷ఖనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఈడీ జరిపిన దాడిని రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి, లక్ష్యంగా



చేసుకోవడానికి కేంద్ర సంస్థలను పద్ధతి ప్రకారం దుర్వినియోగం చేయడానికి ఇది మరో ఉదాహరణ. ఇటువంటి కక్షపూరిత చర్యలు నిరంకుశ మనస్తత్వాన్ని బయటపెడతాయి. ఈ అప్రజాస్వామిక ఎత్తుగడలకు పినరయి, సిపిఎం బెదరబోవు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల మద్దతుతో సిపిఎం దృఢంగా పోరాడుతుంది. అరవింద్ కేజీవ్రాల్ విషయంలో చేసినట్లే, ఆయనను లక్ష్యంగా చేసుకోవడానికి కాంగ్రెస్ నాయకత్వం ఈడీని చురుకుగా ప్రోత్సహించిందన్నది స్పష్టం' అని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర సంస్థలను ఉపయోగించుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేతులు కలిపిందని సిపిఎం పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా మార్చే ప్రయత్నాన్ని కేరళ ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకున్నారని తెలిపింది. ఈ చర్యను ప్రతిఘటించాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ, కేరళ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి, ప్రజాస్వామ్య నిరసనలు, సామూహిక కార్యాచరణ ద్వారా ఈ రాజకీయ దాడులను ఎదుర్కొం టామని సిపిఎం పేర్కొంది. ఈడీ నిర్వహిస్తున్న సోదాలకు వ్యతిరేకంగా కేరళతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఆగ్రహిస్తూ పార్టీ శ్రేణులు, ప్రజలు వీధుల్లోకి వచ్చారు. కన్నూర్‌లోని పినరయి విజయన్ కుటుంబ నివాసం, తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న ఆయన అ÷–దదె ఇంటి ముందు సిపిఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టారు. తిరువనంతపురంలో జరిగిన ఆందోళనలో సిపిఎం కేరళం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిదన్, వి.శివన్‌కుట్టి, జాన్ బ్రిట్టాస్, వి. జాయ్, అనవూర్ నాగప్పన్, వి.కె. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కన్నూర్‌లో జరిగిన నిరసనలో ఎం.వి. జయరాజన్, పి. జయరాజన్, కె.కె. రాజేష్, కె.కె. శైలజ తదితరులు పాల్గొన్నారు. కోజికోడ్ జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ మాట్లాడుతూ? ఈడీ సోదాలు పార్టీపై, పినరయి విజయన్‌పై జరిగిన 'హేయమైన రాజకీయ దాడి'గా పేర్కొన్నారు. ఈ చర్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ మాట్లాడుతూ, పినరయి విజయన్‌కు ఎక్సాలాజిక్ వ్యవహారంతో ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టులు ఇప్పటికే పేర్కొన్నప్పటికీ, రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# సోషల్ మీడియా పరిచయం.. బాలికపై అత్యాచారానికి దారితీసిన వైనం

## కడప జిల్లాలో 15 ఏళ్ల బాలికపై అత్యాచారం

కడప **మే 27(ప్రజావినికిడి):**
కడప జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన యువకుడు, పదో తరగతి పూర్తి చేసిన ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు, అతని కోసం గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. దువ్వూరు మండలానికి చెందిన 15 ఏళ్ల బాలికకు, వల్లూరు మండలం కోట్లూరు గ్రామానికి చెందిన ఈశ్వర్ (19) అనే యువకుడితో సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. ప్రేమ పేరుతో బాలికను మభ్యపెట్టిన నిందితుడు, ఆమెను తన మోటార్‌సైకిల్‌పై ఖాజీపేటలోని ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలికకు తీవ్ర రక్తస్రావం అయినప్పటికీ, నిందితుడు కనికరించలేదు. అనంతరం బాలికను ఆమె ఇంటి సమీపంలో వదిలిపెట్టి ఈశ్వర్ పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతూ ఇంటికి చేరుకున్న కుమార్తెను చూసి కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఆమెను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి, ఆపై మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. మంగళవారం బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు ఈశ్వర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.





# చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ

రాజస్థాన్ రాయల్స్ చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ మరో సంచలనం నమోదు చేశాడు. చండీగఢ్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న ఎలిమినేటర్ మ్యాచ్?లో 14ఏళ్ల రికార్డ్?ను బద్దలుకొట్టాడు. ఈ మ్యాచ్‌లో తొలి నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డ వైభవ్ 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ఇందులో 8 సిక్స్‌లు ఉండడం విశేషం. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో సింగిల్ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా వైభవ్ తన పేరును రికార్డుల్లోకెక్కించుకున్నాడు. ఇప్పటిదాకా ఈ సీజన్‌లో వైభవ్ 61లి సిక్స్‌లు బాదాడు. దీంతో మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ రికార్డ్ తుడిచిపెట్టుకుపోయింది. అతడు 2012 ఎడిషన్‌లో 59 సిక్స్‌లు కొట్టాడు. ప్రస్తుత సీజన్‌లో వైభవ్ ఆ రికార్డును బ్రేక్ చేసి సరికొత్త రికార్డ్ సృష్టించాడు. ఇదే మ్యాచ్‌లో క్రిస్ గేల్ పేరిట ఉన్న మరో రికార్డ్‌ను కూడా వైభవ్ బ్రేక్ చేసేలా కనిపించాడు. హాఫ్ సెంచరీ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగిన అతడు ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదేశాడు. 28 బంతుల్లోనే 97 పరుగులు చేశాడు. దీంతో గేల్ పేరిట ఉన్న ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీ (30 బంతుల్లో) రికార్డ్‌ను బ్రేక్ చేస్తాడని అనుకున్నారంతా. వైభవ్ ఊపు చూస్తే చేసేలాగే కనిపించాడు. కానీ ప్రఫుల్ హింగే వేసిన ఓ చక్కటి బంతికి భారీ షాట్ ఆడబోయి ఫీల్డర్‌కు చిక్కాడు. దీంతో 97 వ్యక్తిగత స్కోర్ వద్ద వైభవ్ పెవిలియన్‌కు చేరాడు. ఈ ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 12 సిక్స్‌లు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ 334.48 కావడం మరో విశేషం. రాజస్థాన్ ఇన్నింగ్స్ విషయానికొస్తే, తొలుత ధారాళంగా పరుగులిచ్చినా డెత్ ఓవర్లలో సన్‌రైజర్స్ కట్టుదిట్టంగా బంతులేసింది. చివరి నాలుగు ఓవర్లలో 36 రన్స్ మాత్రమే ఇచ్చారు. ఇక 20 ఓవర్లలో రాజస్థాన్ 8వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. వైభవ్ (97)తోపాటు ధ్రువ్ జురెల్ (50) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. రియాన్ పరాగ్ (26 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ప్రఫుల్ హింగే 3, శివాంగ్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ మలింగ తలో వికెట్ పడగొట్టారు.

# సీఎస్కే కోచ్‌గా ఎంఎస్ ధోనీ

సీఎస్కేను 5 సార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిపిన లెజెండరీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తుపై ఆ జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ సంచలన ప్రకటన చేశారు. మోకాలి గాయం కారణంగా ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్లో ఒక్క మ్యాచ్‌లో కూడా స్టేడియంలోకి దిగలేకపోయాడు. దీంతో ధోనీ ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు జోరందుకున్న తరుణంలో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ.. ధోనీ జట్టులో ఏ పాత్రలో ఉండాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది పూర్తిగా ధోనీ వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ధోనీ సీఎస్కే జట్టులోనే శాశ్వతంగా కొనసాగాలని తాము కోరుకుంటున్నట్లు వెల్లడించారు. “ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మేము సంతోషిస్తాం. ధోనీ ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా ఆయన ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది” అని సీఈఓ పేర్కొన్నారు. ధోనీ



అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించనప్పటికీ.. వచ్చే సీజన్ నాటికి ఎంఎస్ ధోనీ సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే ఊహాగానాలకు ఈ కామెంట్స్ మరింత బలాన్ని చేకూర్చాయి.ధోనీ తర్వాత సీఎస్కే సారథ్య బాధ్యతలు చేపట్టిన రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీపై వస్తున్న విమర్శలకు కాశీ విశ్వనాథన్ అడ్డుకట్ట వేశారు. “రుతురాజ్ దాదాపు మూడు, నాలుగు ఏళ్ల పాటు ధోనీని చాలా దగ్గరగా గమనించిన తర్వాతే కెప్టెన్సీని అందుకున్నాడు. ఎంఎస్ ధోనీ, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు రుతురాజ్‌ను ఎంతో ప్రశాంతంగా ఉండే కెప్టెన్‌గా తీర్చిదిద్దారు. రాబోయే రోజుల్లో సీఎస్కేలోకి వచ్చే యువ క్రికెటర్లలో కూడా రుతురాజ్ ఇదే నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాడనే పూర్తి నమ్మకం మాకుంది” అని ఆయన వెల్లడించారు.ఈ ఐపీఎల్ 2026 సీజన్‌లో సీఎస్కే ప్రదర్శన అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ధోనీ మైదానంలో లేకపోవడం జట్టుపై స్పష్టమైన ప్రభావాన్ని చూపింది. లీగ్ దశలో ఆడిన 14 మ్యాచ్‌లలో సీఎస్కే కేవలం 6 మ్యాచ్‌లలో మాత్రమే విజయం సాధించి, 12 పాయింట్లతో పట్టికలో 8వ స్థానానికి పరిమితమై ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకుంది. సీజన్ మధ్యలో జట్టు పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో లీగ్ దశలోనే సీఎస్కే ప్రయాణం ముగిసింది.

# వరుసగా రెండో సీజన్‌లో ఫైనల్లోకి ఆర్సీబీ..

డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అద్భుతం చేసింది. ఈ సీజన్ లో తొలిసారి ప్లే ఆఫ్స్ కు చేరిన జట్టుగా నిలిచిన ఆర్సీబీ.. తన రికార్డును నిలబెట్టుకుంటూ, ఫైనల్లోకి కూడా ప్రవేశించింది. ధర్మశాలలో మంగళవారం జరిగిన క్వాలిఫయర్ -1లో మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ పై 92 పరుగులతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఫైనల్లోకి ప్రవేశించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో ఆర్సీబీ 5 వికెట్లు 254 పరుగుల భారీ స్కోరు సాధించింది. క్వాలిఫయర్ మ్యాచ్ లో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. రజత్ పతిదార్ కెప్టెన్ ఇన్నింగ్స్ (33 బంతుల్లో 93 నాటౌట్, 5 ఫోర్లు, 9 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. జాసన్ హోల్డర్, కగిసో రబాడ కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం చేజింగ్ లో 19.3 ఓవర్లలో గుజరాత్ కేవలం 162 పరుగులకే ఆలౌటైంది. ఫినిషర్ రాహుల్ తెవాటియా సూపర్బ్ ఫిఫ్టీ (43 బంతుల్లో 68, 8 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచి, ఒంటరి పోరాటం చేశాడు బౌలర్లలో జేకబ్ డఫీ మూడు వికెట్లతో రాణించాడు. ఈ విజయంతో ఆర్సీబీ ఫైనల్ కు వెళ్లగా, జీటీ, క్వాలిఫయర్ 2కి పడిపోయింది. బుధవారం సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగే మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ విజేతతో జీటీ తలపడుతుంది. ఇందులో గెలిచిన జట్టుతో ఫైనల్లో ఆర్సీబీ తలపడనుంది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన




గుజరాత్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగలింది. మూడు ఫోర్లు కొట్టి జోరు చూపించిన, ఆరెంజ్ క్యాప్ హోల్డర్, ఓపెనర్ సాయి సుదర్శన్ (14) ఆరంభంలోనే హిట్ వికెట్ గా ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులో అసౌకర్యంగా కదిలిన కెప్టెన్ శుభమాన్ గిల్ (2)ను భువనేశ్వర్ కుమార్ బౌల్డ్ చేశాడు. ఈ దశలో జోస్ బట్లర్ (11 బంతుల్లో 29, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ఎదురుదాడికి దిగడంతో జీటీ స్కోరు బోర్డు కాస్త పరుగులెత్తింది. తను రెండు కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. అయితే కాసేపటికే తనను జోష్ హేజిల్ వుడ్ పెవిలియన్ కు పంపాడు. తర్వాతి ఓవర్లోనే నిశాంత్ సింధు (5) కూడా ఔట్ కావడంతో జీటీ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇక పవర్ ప్లేలో 51 పరుగులు సాధించి, టార్గెట్ కు చాలా దూరంగా జీటి ఇన్నింగ్స్ సాగింది. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో వికెట్లను జీటీ కోల్పోయింది. వాషింగ్టన్ సుందర్ (8), జాసన్ హోల్డర్ డకౌట్ అవడంతో జీటీ కోలుకోలేక పోయింది. మరోవైపు వరుసగా వికెట్లు పడుతున్నా, తెవాటియా.. ఎదురు దాడికి దిగాడు. ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో రెచ్చిపోయాడు. తొమ్మిదో వికెట్ కు మహ్మద్ సిరాజ్ (5) తో కలిసి 68 పరుగులు జోడించాడు. ఇందులో సింహభాగం పరుగులను తెవాటియానే సాధించాడు. ఈ క్రమంలో 33 బంతుల్లో అర్ధ సెంచరీని తెవాటియా పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే తను ఔట్ కావడంతో జీటీ ఇన్నింగ్స్ ముగిసింది. ఓవరాల్ గా డిఫెండింగ్ చాంపియన్ గా బరిలోకి దిగి, ఆర్సీబీ వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకు పోవడంపై ఆ జట్టు ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అనవసర నిర్ణయమే గుజరాత్ కొంపముంచింది

● టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్



గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు టీమ్ మేనేజ్‌మెంట్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. వారు తీసుకున్న పనికిమాలిన నిర్ణయమే గుజరాత్ టైటాన్స్ విజయవకాశాలను దెబ్బతీసిందన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన క్వాలిఫయర్-1లో సమష్టిగా విఫలమైన గుజరాత్ టైటాన్స్ 92 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది.ఈ భారీ విజయంతో ఆర్‌సీబీ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. గుజరాత్ టైటాన్స్‌కు క్వాలిఫయర్-2 ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మ్యాచ్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. కీలకమైన క్వాలిఫయర్-1లో కుల్వంత్ ఖేజ్రోలియాను ఎందుకు ఆడించారో తనకు అర్థం కావడం లేదన్నాడు. అతను ఒకే ఓవర్‌లో 28 పరుగులు ఇచ్చాడని, అది మ్యాచ్ మూమెంటమ్‌ను మార్చేసిందని అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ తీసుకున్న నిర్ణయాలు, బౌలింగ్ మార్పులు కూడా సరిగ్గా లేవని విమర్శించాడు.'రషీద్ ఖాన్‌కు ఈ సీజన్ అంత బాగా సాగలేదు. ఐపీఎల్ 2026 సీజన్ మొత్తం స్పిన్నర్లకు అంత గొప్పగా ఏమీ లేదు. కానీ మిగతా స్పిన్నర్లతో పోలిస్తే రషీద్ ఖాన్‌కు ఇది కాస్త మెరుగైన సీజన్ అని చెప్పవచ్చు. అయితే, ఏడో ఓవర్ లోనే రషీద్‌ను బౌలింగ్‌కు దించకుండా శుభ్‌మన్ గిల్ ఒక మంచి అవకాశాన్ని చేజార్చుకున్నాడనేది నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ ఐపీఎల్‌లో శుభ్‌మన్ గిల్ అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా కాకపోయినా.. మెరుగైన కెప్టెన్లలో ఒకడిగా రాణించాడు. ముఖ్యంగా అతను తన బ్యాటింగ్ శైలిని మార్చుకున్న విధానానికి నేను హాట్సాఫ్ చెప్తాను. అయితే వారి జట్టులో కొన్ని బలహీనతలు, లోపాలు ఉన్నాయి. వాటిని వారు హోమ్ అడ్వాంటేజ్‌ను ఉపయోగించుకుని కవర్ చేశారు.తటస్థ వేదికలో ఆర్‌సీబీ.. గుజరాత్ టైటాన్స్ లోపాలను బట్టబయలు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలవడం చాలా కీలకం. శుభ్‌మన్ టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. కానీ ఈరోజు వారు కుల్వంత్ ఖేజ్రోలియాను ఎందుకు ఆడించారో నాకు అస్సలు అర్థం కాలేదు. మీరు ఎవరినైనా ఆడించాలనుకుంటే, వారి బౌలింగ్‌లో ఏదైనా మిస్టరీ ఉండాలి. అతనేమీ మిస్టరీ స్పిన్నర్ లేదా మిస్టరీ బౌలర్ కాదు. ఇప్పటికే కొన్ని మ్యాచ్‌లు ఆడాడు. 15వ ఓవర్‌లో ఏకంగా 28 పరుగులు వచ్చాయి. అది ఆటను పూర్తిగా మార్చేసింది.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ 255 పరుగుల భారీ లక్ష్యాన్నినిర్దేశించగా.. గుజరాత్ టైటాన్స్ 162 పరుగులకే కుప్పకూలింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే ఎలిమినేటర్ విజేతతో గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్-2 ఆడనుంది.




# పాటిదార్‌పై అంబటి రాయుడు ప్రశంసల జల్లు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల జల్లు కురిపించాడు. గత నాలుగేళ్లలో ఊహించని రీతిలో రజత్ పాటిదార్ మెరుగయ్యాడని కొనియాడాడు. మరే ఆటగాడు కూడా ఈ స్థాయిలో ఇంప్రూవ్ కాలేదని కితాబిచ్చాడు. భవిష్యత్తులో టీమిండియా తరఫున కూడా గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడుతాడని జోస్యం చెప్పాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1లో రజత్ పాటిదార్ మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. అతని విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ 92 పరుగులతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది.ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్‌ఫో షోలో ఈ మ్యాచ్ గురించి అంబటి రాయుడు మాట్లాడాడు. 'రజత్ పాటిదార్ అసాధారణమైన ఇన్నింగ్స్ ఆడాడు. పిచ్‌ను అర్థం చేసుకోవడానికి ఆరంభంలో కాస్త సమయం తీసుకున్నాడు. ఆ తర్వాత తనదైన షాట్లతో చెలరేగాడు. ఆ షాట్లలోని ప్రత్యేకత ఏంటంటే.. ఇదే ఆటగాడు 2022 ప్లేఆఫ్స్‌లో కూడా సెంచరీ కొట్టాడు. అప్పట్లో అతను బ్యాట్ ఫేస్ క్లోజ్ చేసి.. ఎక్కువగా ఆన్‌సైడ్ ఆడేవాడు. కానీ ఇప్పుడు టెక్నికల్ పరంగా చూస్తే అతను తన బ్యాట్ ఫేస్‌ను ఓపెన్ చేసి ఆడుతున్నాడు. అతని బ్యాట్ స్పీడ్ కూడా మెరుగైంది. గత నాలుగేళ్లలో ఏ ఆటగాడు కూడా ఈ స్థాయిలో ఇంప్రూవ్ అవ్వడం నేను చూడలేదు. గతేడాదితో పోల్చి చూసినా కూడా.. చాలా మెరుగయ్యాడు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లను అద్భుతంగా ఎదుర్కొంటున్నాడు.

# మహేష్ బాబు నా ఫేవరేట్ తెలుగు హీరో

● సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు తన ఫేవరేట్ తెలుగు క్రికెటర్ అని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తెలిపాడు. తాను చాలా తక్కువగా సినిమాలు చూస్తానని, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడే సమయంలో తెలుగు సినిమాల గురించి సహచర ఆటగాళ్లతో చర్చిస్తానని చెప్పుకొచ్చాడు.ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ప్యాట్ కమిన్స్ సత్తా చాటుతున్నాడు. వెన్ను గాయంతో ఫస్టాఫ్ సీజన్ మ్యాచ్‌లకు దూరమైన కమిన్స్.. సెకండాఫ్ సీజన్ మ్యాచ్‌లకు అందుబాటులోకి వచ్చాడు. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్వితీయమైన ప్రదర్శనతో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. రెండో టైటిల్ గెలవడంపై కన్నేసింది.ఐపీఎల్ ప్రమోషన్స్ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు ప్యాట్ కమిన్స్ తెలుగు సినిమాలు, హీరోల గురించి మాట్లాడాడు. సినిమాల డైలాగ్స్ కూడా చెప్పాడు. సూపర్ స్టార్ మహేష్ బాబును కూడా ప్రత్యేకంగా కలుసుకున్న కమిన్స్.. అందుకు సంబంధించి ఫోటోను సోషల్ మీడియా వేదికగా పంచుకొని తన అభిమానాన్ని చాటుకున్నాడు.ఐపీఎల్ యాడ్ షూటింగ్స్ సమయంలో మహేష్ బాబుతో కమిన్స్ భేటి అయ్యాడు. ఆ సమయంలో మహేష్ బాబుతో దిగిన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. 'ప్రిన్స్ ఆఫ్ టాలీవుడ్‌తో మధ్యాహ్న సమయాన్ని సరదాగా గడిపాను'అని క్యాప్షన్ ఇచ్చాడు. మహేష్ బాబు కూడా తాను కమిన్స్‌కు పెద్ద అభిమానినని బదులిచ్చాడు.స్టార్ స్పోర్ట్స్ తెలుగు, ప్రమోషనల్ వీడియోల్లో ప్యాట్ కమిన్స్ టాలీవుడ్ టాప్ హీరోల ఐకానిక్ డైలాగ్స్ చెప్పి తెలుగు అభిమానులను ఫిదా చేశాడు. 'ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే వినను' అనే మహేష్ బాబు (పోకిరి) డైలాగ్‌ను కమిన్స్ ఎంతో స్టైలిష్‌గా చెప్పాడు. అల్లు అర్జున్ పుష్ప సినిమాలోని 'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరూ'అంటూ పుష్ప మేనరిజం చేసి చూపించాడు. పవన్ కళ్యాణ్ సిగ్నేచర్ మేనరిజం (గడ్డం కింద చేయి తిప్పడం) కూడా చేసి నెటిజన్లను ఆకట్టుకున్నాడు. బుధవారం న్యూఛండీఘర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి క్వాలిఫయర్-2కు అర్హత సాధించాలనే పట్టుదలతో ఉంది. పాయింట్స్ టేబుల్‌లో టాప్-2లో నిలిచిన ఆర్‌సీబీ, గుజరాత్ టైటాన్స్‌తో సమంగా 18 పాయింట్స్ సాధించినా.. పేలవ రన్‌రేట్ కారణంగా సన్‌రైజర్స్ మూడో స్థానానికి పరిమితమైంది. అయితే 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలిసారి టైటిల్ గెలిచినప్పుడు కూడా మూడో స్థానంలోనే నిలిచింది. అప్పుడు ఫైనల్లో ఆర్‌సీబీని ఓడించి టైటిల్ గెలిచింది.




# సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల

ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.

# కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే



కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫోటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.



# ట్రోలర్స్‌ను పెద్దగా పట్టించుకోను

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్‌లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు. ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారని అన్నారు. అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు. ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఎన్నో బాధ్యతలు ఒకేసారి ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా చాలా సందర్భాల్లో మర్చిపోతాను. అలాంటివాటిని పట్టుకుని ట్రోల్ చేయడం సరికాదు అని వ్యాఖ్యానించారు. ఇక తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై కూడా ఆయన స్పందించారు. ఒక సీన్ కోసం నేను 70 లేదా 80 టేక్స్ తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. కానీ అందులో ఎలాంటి నిజం లేదు. ఎక్కువలో ఎక్కువ మూడు టేక్స్ తీసుకుని ఉంటాను. పూర్తిగా ఫేక్ సమాచారంతో ట్రోలింగ్ చేశారని స్పష్టం చేశారు.

## చిరంజీవి జోక్యంతో 'పర్సంటేజీ' నిర్ణయం వాయిదా..

# రెంటల్ విధానంలోనే 'పెద్ది' సినిమా!



మెగాస్టార్ చిరంజీవితో ఎగ్జిబిటర్ల తాజా సమావేశం అనంతరం వివాదం ఓ కొలిక్కి వచ్చింది. తెలంగాణ ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య గత కొంతకాలంగా పర్సంటేజీ వివాదం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. పెద్ది చిత్రం నుంచి పర్సంటేజీ విధానం అమలు కావాల్సిందేనని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరంజీవితో తెలంగాణ ఎగ్జిబిటర్లు ఈరోజు సమావేశమయ్యారు. ఆయన జోక్యంతో పర్సంటేజీ విధానం నిర్ణయం వాయిదాపడింది.దీంతో జూన్ 4వ తేదీన విడుదల కానున్న పెద్ది చిత్రంను రెంటల్ విధానంలోనే ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. జూన్ 30వ తేదీ తర్వాత విడుదలయ్యే చిత్రాలకు పర్సంటేజీ విధానం వర్తింపజేస్తామని వారు తెలిపారు. తెలంగాణ ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ కమిటీ నివేదిక మేరకు ముందుకు సాగాలని సూచించారు.




# ప్రతి భాషను గౌరవిస్తా

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లోనూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'ఐ-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది.భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది.పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.

# చిరంజీవిపై అసత్య ప్రచారం....

## యూట్యూబ్ ఛానెల్ పై కేసు నమోదు



మెగాస్టార్ చిరంజీవి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా , ఆయన ఆరోగ్యం తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానెల్ పై పోలీసుల కేసు నమోదు చేశారు. చిరంజీవి ఆరోగ్యంపై అసత్యం ప్రచారం చేయడంతో మార్ఫింగ్ వీడియోను పోలీసులు గుర్తించారు. ఆ వీడియోలను ఓ యూట్యూబ్ ఛానెల్ విస్తృతంగా ప్రచారం చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. యూట్యూబ్ ఛానెల్ అప్ లోడ్ చేసిన వివాదాస్పద కంటెంట్ కు సంబంధించిన వీడియో లింకులు, స్క్రీన్ షాట్లను న్యాయవాది రామకృష్ణ మిర్యాల పోలీసులకు అందజేశారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై ముఖ్యంగా ఆరోగ్యంపై తప్పుడు వార్తలు ప్రసారం చేయడం చట్టవిరుద్ధమని ఫిర్యాదులో న్యాయవాది వివరించారు. పోలీసులు యూట్యూబ్ ఛానెల్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# 'పుష్ప' అవకాశం నాకూ షాకే..

## ఆ పాత్ర నా జీవితాన్నే మార్చేసింది: సునీల్

కమెడియన్‌గా కెరీర్ ప్రారంభించి, హీరోగా, విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సునీల్, 'పుష్ప' చిత్రంలో మంగళం శ్రీను పాత్రకు ఎంపికవడం తనకూ ఓ షాక్ అని అన్నారు. ఈ పాత్ర తన జీవితాన్నే మార్చేసిందని, అన్ని భాషల్లోనూ అవకాశాలు తెచ్చిపెట్టిందని ఆయన తెలిపారు.తన తాజా మలయాళ చిత్రం 'కాటాలన్' తెలుగు వెర్షన్ ప్రమోషన్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సునీల్ ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'పుష్ప'లో విలన్‌గా సుకుమార్ మిమ్మల్ని ఎలా ఊహించుకున్నారని అడగ్గా.. "లాక్‌డౌన్ సమయంలో నేను కామెడీ పాత్రలు కాకుండా వేరేవి చేస్తున్నానని సుకుమార్‌కు చెప్పాను. రెండు రోజులకే ఆయన ఫోన్ చేసి 'పుష్ప'లో పూర్తిస్థాయి విలన్ పాత్ర ఉంది, కానీ కామెడీ చేయకూడదు, శరీరం కూడా కదపకుండా హావభావాలు పలికించాలని చెప్పారు," అని సునీల్ వివరించారు.లుక్ టెస్ట్ కోసం పంపిన కాస్ట్యూమ్స్‌తో రకరకాలుగా ఫోటోలు తీసి పంపించానని, అవి నచ్చడంతో ఆ పాత్రకు ఎంపికయ్యానని గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరిగినన్ని రోజులు పాత్ర కోసం నుదుటిపై షేవ్ చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు.సునీల్ 'మారి' అనే కీలక పాత్రలో నటించిన 'కాటాలన్' చిత్రం మే 28న తెలుగులో విడుదల కానుంది. ఏనుగు దంతాల అక్రమ రవాణా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి పాల్ జార్జ్ దర్శకుడు. ఇందులో ఆంటోనీ వర్గీస్, కబీర్ దుహాన్ సింగ్, దుషారా విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No